# థాంక్స్ సుందరీ!

మల్లిక్

సుందరికి రాజారావుమీద అనుమానం జాస్తి! దానికి కారణాలు రెండు - సుందరి అనాకారి కావడం ఒకటి ... గయ్యాళి కావడం రెండు! అనాకారి సుందరిని రాజారావు పెళ్ళి చేసుకోవడానికి ప్రధాన కారణం రాజారావు బీదవాడు కావడం ... సుందరి నాన్న ధనవంతుడవడం! అదీ సంగతి!!

రాజారావు పందుంపుల్లతో పళ్ళు తోముకుని ... బావి దగ్గిర మొహం కడుక్కుని ఇంట్లోకి వచ్చాడు. తువ్వాలుతో మొహం తుడుచుకుంటుండే సుందరి వంటింట్లోనుండి అరిచింది.

"అంతసేపు బావిదగ్గిర మొహం ఎందుకు కడుక్కుంటున్నారో నాకు తెలుసు!" ఈ కొత్త వివరణకి ఆశ్చర్యపడి రాజారావు తేరుకునే లోగానే సుందరి మొహం మటమటలాడిస్తూ అందుకుంది.

"ఆ గోడమీదనుండి ఆ పంతులమ్మను కండ్లారా చూశారా! కోరిక తీరిందా?"

రాజారావు తెల్లబోయి నూతివేపు... గోడవేపు చూశాడు. అక్కడ ఆడ పురుగనేది ఎక్కడా లేదు.

"అదుగో ... దానికోసమే గదా... వెదుకులాట! సుందరి అప్పుడు ప్రారంభించిన సాధింపు రాజారావు ఆఫీసుకు బయల్దేరిందాకా ఆగలేదు! రోడ్డుమీద అడుగుపెట్టిన రాజారావుకు లోకమంతా పచ్చగా ... చల్లగా అనిపించింది! నడుస్తున్న రాజారావు కండ్లు అప్రయత్నంగా తను పక్క ఇంటివేపు చూశాయి. కానీ, ఆ ఇంటి గుమ్మానికి వేసున్న తాళం రాజారావును వెక్కిరించింది!

ఆ రోజు సాయంత్రం—

మామూలుగా రాజారావు ఇంటికివచ్చి ఉస్సురని కుర్చీలో కూలబడ్డాడు

మొహం మటమటలాడిస్తూ సుందరి అందుకుంది. "నాకు తెలుసా చికా కెందుకో ... ఆ "యశోద" ముండ కనపళ్ళేదనేగా !''

రాజారావు బిత్తరపోయాడు. తర్వాత గుర్తుకు వచ్చింది ఉదయం సాగిన తతంగం ! దాన్తోపాటు పక్కింట్లో కొత్తగా చేరిన టీచరు పేరు "యశోద" అని కూడా తెలిసింది !

"నా రాత...అవున్లే... దానికోసమే ఆదరా బాదరా ఆఫీసు వదిలేసి మీరు తొందరగా ఇంటికి వస్తే ! నాకు తెలీదా ఏం ? అదెక్కడినుండి దాపురించిందో నా ప్రాణానికి..."

రాత్రి భోజనాలయిన తర్వాత రాజారావు సుందరికి చాలా అనునయంగా...వివరంగా చెప్పాడు—తన కలాంటి ఉద్దేశ్యాలు లేవనీ ... దాదాపు గెడ్డం పట్టుకుని బ్రతిమిలాడినంత పని చేశాడు.

సుందరి ముసుగదీసుకుని అటు తిరిగి పడుకుంది.

* * *

దడదడలాడే గుండెతో దావివేపు నడిచాడు రాజారావు. బకెట్లో చెంబు ముంచగానే సుందరి గొంతు మంద్ర స్థాయినుండి తారాస్థాయి చేరుకుంది.

"ఇంత ప్రొద్దున్నే లేవడం ఎందుకో నాకు తెలుసు ... నా కొంపకి దాపురించింది పాపిష్టి మొహం...అయ్యో...



అయ్యో ... అసలు ఈయనదగ్గరుండాలి ... దాన్ని చూడంది నిద్ర పట్టదు గావాలు ... అందుకనీ అంత వెంపర్లాట !

రాజారావు నిస్తేజుడై... నిర్వీర్యుడై గబగబ మొహం కడుక్కుని ఇంట్లోకి పరుగెత్తినట్లు వచ్చేశాడు. వస్తున్నపుడు ఎడమ కన్ను చివర నుండి గోడమీదుగా 'యశోద' తాలూకు చీర కనిపించింది. కాని, మనిషి కనిపించలేదు. అప్పటికే సుందరి రెండు చెంబులు గోడకు గిరాటేసింది !

"సుందరీ...నా మాట విను !"

"వినకేం చేస్తాను... ఛస్తానా!"

"నా కలాంటి అలవాట్లు లేవు. అవసరం అంతకన్నా లేదు... నన్నిట్లా అనుమానపడడం మనిద్దరికీ మంచిది కాదు!"

"మంచిది కాదంటే ... అంటే ఏం చేస్తారేం! ఈ చిలక పలుకులన్నీ అదే...ఆ ముండే నేర్పింది ... ఆఫీసు మూసి ఎక్కడ కలుసుకుంటున్నారేం ఖర్మ!"

"అవతలవాళ్ళు వింటే బాగుండదు!"

"హన్నా!" అని మొహమంతా ఆశ్చర్యం, క్రోధం నింపుకుని ఈసడింపుగా రాజారావువేపు చూసింది సుందరి. రాజారావు చెప్పుల్లోకి కాళ్ళు దూర్చి అక్కడో క్షణం ఉండకుండా బయటపడ్డాడు!

ఆ తర్వాత వారంరోజుల్లో 'యశోద' అనుకోకుండానే రాజారావుకు గోడమీద నుండి చాలాసార్లు కనిపించింది. కనిపించినపుడల్లా తెల్లటి మెరుస్తున్న ఫాలభాగంమీద బొట్టు కనిపించక పోవడంతో 'విధవ' అన్న విషయం కనిపెట్టగలిగాడు రాజారావు.

"మీరో విషయం తెగేసి చెప్పండి!" అలసి ఆయాసంగా రొప్పుతూ రాజారావు మీదికి ఎగబడింది సుందరి!

"ఏమిటది? ఎపుడూ ఉన్న బాగోతమే గదా!" చిరాగ్గా విసుక్కున్నాడు రాజారావు

"నేను బాగోతం దాన్నే ... రంభ లాంటిది ప్రక్క కొంపలో చేరింది గదా! ఇంక నేనేం కనపడతా ... అంత ఇష్టం ఉన్నవాడివి పోయి దానింట్లోనే ఉండరాదా? నన్నెందుకిట్లా మధ్య అవస్థ పెట్టడం!?"

రాజారావు మాట్లాడలేదు. ఏం మాట్లాడాలో తోచక ... ఎట్లా చెబితే సుందరికి అర్థమవుతుందో అర్థంగాక అట్లా చూస్తూ కూర్చుండిపోయాడు.

"ఇంత ఆస్తి...వ్యాపారం...ఇచ్చి మీకు కట్టబెట్టాడు మా నాన్న ... ఇట్లాంటి భ్రష్టుముండల వెనక పడే వాళ్ళని తెలిస్తే ఆనాడే చచ్చేదాన్ని!"

రాజారావు ఇక నిగ్రహించుకో లేకపోయాడు.

"ఇపుడేం మునిగిపోయిందని..."

"హమ్మా...హమ్మా...అంటే నేను చస్తే మీ కళ్ళు చల్లబడతాయని కదూ? దాన్తో హాయిగా కులకొచ్చని కదూ ... హమ్మా! నేనట్లా చచ్చేదాన్ని కాదు... మీ అంతు చూసి చస్తా... నే నూరుకునే దాన్ని కాదు!"

ఈ మాటలు గోడమీదనుండి అవతలింట్లోకి వినపడతాయని రాజారావుకు తెలుసు! ఇవి విన్నతర్వాత ఆవిడ (యశోద) ఓ రోజు తలవంచుకుని స్కూలుకు పోతున్నదల్లా తలెత్తి రాజారావును చూసి ఓ చిరునవ్వు నవ్వడం రాజారావు గమనించాడు. ఆ

చిరునవ్వులో హేళన లేదు. కోపం అంతకన్నా లేదు. జాలి ఓ మాత్రం పాలు ... సానుభూతి కొంత మేరా... బాధ కలిసి ఉన్న చిరునవ్వది!

ఇంట్లో ఉన్న సమయం సుందరి సాధింపులతో... అందులోనూ ఎక్కువ భాగం తనవాళ్ళు రాజారావుకు ఇచ్చిన ఆస్తి వివరాలు... ఆఫీసు...క్యాష్... రాజారావు తనకు యశోదతో కలిసి చేయదలుచుకున్న "ద్రోహం" దాన్ని తానెంత తెలివిగా పసికట్టి... ఓ కంట కనిపెట్టి ... క్షోభపడిపోతుందో అన్న వివిధ విషయాలతో నరకంలా తయారయింది! రాజారావు ఓ రోజు సుందరి మీద చేయి చేసుకుందా మనుకున్నాడు. నిదానంగా ఆలోచించిన మీదట ఆ ప్రయత్నం విరమించుకున్నాడు. అట్లా చేస్తే సుందరి అనుమానానికి ఓ ఋజువు దొరుకుతుంది. చేసుకోకపోతే ఈ సాధింపుల ప్రళయం ఆగేటట్టు లేదు. దానిగ్గాను సాయంత్రాలు ఆలస్యంగా ఇంటికి రావడం, ఉదయం సాధ్యమైనంత తొందరగా బయటపడడం అలవాటు చేసుకున్నాడు!

ఆ దినం బజార్లో వస్తుంటే రాజారావుకు యశోద ఎదురయింది. తానే పలకరింపుగా చిరునవ్వు నవ్వింది. రాజారావు దద్దరిల్లి చుట్టూ పరికించి చూశాడు. యశోదే చొరవగా పలకరించింది.

"నమస్తే."

"నమస్తే!"

క్షణం ఆగి రాజారావే అన్నాడు, "మీరేం అనుకోకండి ... దాని తీరే అంత!"

యశోద మామూలుగా నవ్వింది. నవ్వి "మీకు థాంక్స్ చెప్పాలి!"

"ఎందుకు?"

"ఎందుకంటే మీ ఓర్పుకు!"

రాజారావు నవ్వాడు తర్వాత యశోద ఇంటికి.. రాజారావు మెయిన్ రోడ్డుమీదకు వెళ్ళిపోయారు. నడుస్తున్న రాజారావును యశోద నవ్విన నవ్వు ఎపుడూ వెంటాడుతూనే ఉంది.

* * *

"సుందరీ!

నీకు కృతజ్ఞతలు ... జీవితంలో నాకు నీ ఆస్తి... ఆఫీసు...క్యాషూ... కాక ఏం కావాలో సూచించావు. నాకవసరమైన కొంత క్యాష్ తీసుకుని యశోదతో వెళ్ళిపోతున్నాను. ఎందుకంటే క్రొత్త సంసారానికి అవసరం గనక! ఆఫీసు తాళంచేతులు టేబిలు డ్రాయర్లో ఉన్నాయి. పుస్తకాలూ అక్కడే ఉన్నాయి."

పి. యస్. యశోదని 'పరిచయం' చేసిన నీకు థాంక్స్ సుందరీ థాంక్స్!!"